

పరదేశీ కథలు

- చిట్టి సిద్ధ లలిత



- 138 -

నమ్మక ద్రోహం

ఎటు చూసినా ఎడారి... మండుటెండలో మధ్యాహ్నం పన్నెండు గంటలకు కాళ్ళూ చేతులూ కట్టేసిన ముగ్గుర్ని జీపులోనుండి కిందకి లాగి మూటల్లా ఇసుకలోకి దొర్లించాడు డ్రైవరు.

వారి కాళ్ళూచేతులూ కట్టేసి వుండటంతో వేడికి తాళలేక ఇసుకలో దొర్లుతూ ఆర్తనాదాలు చేస్తున్నారు వాళ్ళు.

వారి అరుపులతో, కేకలతో ఆ ఎడారి ప్రాంతం మారుమ్రోగుతోంది.

సేటు తలపై ఖుతరా సర్దుకుంటూ జీపులో నుండి ఠీవిగా కిందకు దిగాడు.

బూటు కాలితో వారి ముఖాలను తన్ని తుపుక్కున ఉమ్మి ఊసి...

"యే హైవాన్...మిమ్మల్ని నమ్మి షాపును మీకు వదిలి నెలరోజులు లండన్ పోతే ఇంతకు తెగిస్తారా...

వచ్చిన డబ్బును ముగ్గురూ పంచుకుని బిజినెస్ ను నష్టాలపాలు చేసి నన్ను దివాలా తీయిస్తారా...?

ఎంత ధైర్యం మీకు...! ఈ కువైట్లో నమ్మక ద్రోహానికి శిక్ష ఏంటో తెలుసా..." హుంకరించాడు.

"బాబా అల్లా కల్లిక్ మమ్మల్ని క్షమించు. మేమా పని చెయ్యలేదు.నీ కాళ్ళు పట్టుకుంటాము మమ్మల్ని దయచూడు.

పవిత్రమైన ఈ రంజాన్ రోజుల్లో మాకు ప్రాణభిక్ష పెట్టు" అని దీనంగా అర్థిస్తున్నారు వాళ్ళు.

కరగలేదు సేటు హృదయం.

కాళ్ళతో ఇసుకను విరజిమ్మాడు. మొహాలపై ఇసుక పడి ఉక్కిరిబిక్కిరి అయ్యారు వాళ్ళు.

"ఈ ఎడారిలో ఎండకు మలమల మాడి చావాలి వీళ్ళు ఇదే వీళ్ళకు తగిన శిక్ష. ఇక పద" అన్నాడు సేటు డ్రైవర్ తో... డ్రైవర్ కూడా జాలిపడలేదు.

వాళ్ళవైపు అసహ్యంగా చూస్తూ జీపును కదిలించి ముందుకు ఉరికించాడు. వెనక వాళ్ళ రోదనలు మిన్నంటాయి.

వారి కేకలను విని ఇక్కడేదో ఆహారముందని ఆకాశంలోని గద్దలు గుంపులుగా రాసాగాయి.

🦋🦋🦋

డబ్బు చాలా ప్రమాదకరమైనది. అది మనుషులను మాయ చేస్తుంది. అది ఎన్నో ఘోరాలను చేయిస్తుంది.

ఒక నెలరోజులు పని మీద లండన్ వెళ్ళి కువైట్ రాగానే సేటు ఆశ్చర్యపోయాడు. లాభాల్లో వున్న షాపు నెలరోజుల్లో కోటిరూపాయల నష్టంలో నడుస్తోంది.

షాపులో సేల్స్ మ్యాన్ లుగా పని చేస్తున్న ముగ్గురు ఈజిప్షియన్స్ చేసిన పని ఇదని భావించి వాళ్ళ బుతాకా (ఐడిలు) తీసుకెళ్ళి మనీ ఎక్స్చేంజ్ లలో ఎంక్వైరీ చేసాడు. ఈ నెలలో వాళ్ళు ఈజిప్ట్ కు పంపిన దినారాల లిస్ట్ అంతా బయటికి వచ్చింది.

ఈ నమ్మక ద్రోహాన్ని ఈ సేటే కాదు ఎవరూ క్షమించలేరు. పరదేశులు కుటుంబాన్ని దేశాన్ని విడిచి పొట్టచేతపట్టుకుని పనికోసం, డబ్బుకోసం వస్తారు. మర్యాదగా, పద్ధతిగా పనిచేసుకోవాలి.

అంతేకానీ పనిచ్చి, జీతమిచ్చి నమ్మి షాపును అప్పగిస్తే సేటునే మోసం చేస్తే ఆయన సహిస్తాడా...!

మొదట పోలీసులకు పట్టివ్వాలనే అనుకున్నాడు. కానీ వాళ్ళను ప్రాణాలతో వుంచాలనిపించలేదు.

అలాగని ఐదు పూటలా నమాజు చేసుకునే తను తన చేతులతో కాల్చి వాళ్ళ ప్రాణాలు తీయలేడు.

అందుకే డ్రైవర్ రాము సాయంతో ముగ్గుర్నీ బంధించి ఎడారిలో పారేసి వచ్చాడు. చస్తే పీడా పోతుంది.

తనకు చేసిన నమ్మక ద్రోహానికి వీళ్ళని రాబందులు పీక్కు తినాలి అని కోపంతో పళ్ళు కొరికాడు.

ఇక్కడ ఎడారి ఇసుక తిన్నెల్లో మృత్యువుతో పోరాడుతున్న ఆ ముగ్గురు ఈజిప్షియన్ల ఆర్తనాదాలు క్రమంగా బలహీనపడసాగాయి. ఆకాశంలో గద్దల వలయాలు మరింత కిందకు దిగుతున్నాయి.

ఎండ వేడిమికి చర్మం కాలిపోతోంది, దాహం గొంతును నొక్కేస్తోంది. ప్రాణాలు గాల్లో కలిసిపోయే క్షణాలు దగ్గరపడుతున్న వేళ... దూరం నుండి ఒక వింత శబ్దం వినబడింది. అది కారు ఇంజన్ శబ్దం కాదు... ఒంటెల గిట్టల చప్పుడు...!

ఆ ముగ్గురు మస్రీల అదృష్టం కొద్దీ, అటుగా వస్తున్నది కువైట్ ఎడారిలో సంచరించే ఒక పురాతన బెదూన్ తెగకు చెందిన ముసలి వాడు 'అబ్దుల్లా', అతని మనవడు తారిఖ్.

గద్దల గుంపును చూసి, అక్కడ ఏదో జంతువు చనిపోయి ఉంటుందని భావించి అటు వైపు వచ్చారు.

కానీ, అక్కడ కాళ్ళూ చేతులూ కట్టేసి ఎడారి ఇసుకలో నరకయాతన అనుభవిస్తున్న ముగ్గురు మనుషులను చూసి దిగ్భ్రాంతి చెందారు.

"తారిఖ్... త్వరగా వాళ్ళ కట్లు విప్పి నీళ్ళు తాగించు" అని అరిచాడు అబ్దుల్లా.

రామబాణంలా దూకిన తారిఖ్, చకచకా తన నడుముకున్న కత్తితో వాళ్ళ చేతి కట్లు కోసేశాడు. ఒంటెకు కట్టి ఉన్న తోలు సంచిలోని చల్లటి నీటిని వాళ్ళ మొహాలపై చల్లి, కొద్దికొద్దిగా గొంతుల్లో పోశాడు.

సగం చచ్చి బతికిన ఆ ముగ్గురు ఈజిప్షియన్లు కృతజ్ఞతతో అబ్దుల్లా కాళ్ళపై పడ్డారు.

"బాబా... మమ్మల్ని కాపాడండి. ఆ సేటు మమ్మల్ని చంపేయాలని చూశాడు. మేము దొంగలము కాము" అని ఏడ్చారు.

"సరే తరువాత మాట్లాడుకుందాం, ముందు తొందరగా ఇక్కడనుండి పోదాం పదండి" అంటూ అబ్దుల్లా వారిని తన ఒంటెలపై ఎక్కించుకుని, ఎడారి లోపల ఉన్న తన టెంట్ కు తీసుకువెళ్ళాడు. అక్కడ వారికి కొన్ని ఖర్జూరాలు, కొంత ఆహారం ఇచ్చి కోలుకునేలా చేశాడు. వారు కోలుకున్నాక అసలు ఏం జరిగిందో అడిగాడు.

ఆ ముగ్గురిలో ఒకడైన 'అహ్మద్' కళ్ళు తుడుచుకుంటూ అసలు విషయం చెప్పడం ప్రారంభించాడు.

"బాబా...! మేము నమ్మకద్రోహులం కాదు. మేము సేటు డబ్బు దొంగిలించలేదు" అన్నాడు అహ్మద్ గొంతు పూడుకుపోతుండగా.

"మరి ఆ కోటి దినారుల నష్టం? మీ ఐడిలతో మీరు ఈజిప్టుకు పంపిన దినారాల సంగతి ఏంటి?" అని అడిగాడు తారిఖ్ అనుమానంగా చూస్తూ...

అహ్మద్ కన్నీళ్లతో "సేటు లండన్ వెళ్ళగానే సేటు మూడో భార్య అమీనా షాపుకు వచ్చి కూర్చునేది.

రోజూ వచ్చిన డబ్బును తన బ్యాగులో వేసుకుని వెళ్ళిపోయేది. యజమానురాలు కావడంతో మేము ఏమీ అనలేకపోయాము. ఆమెకు ఈజిప్ట్ లో ఒక ప్రియుడు వున్నాడు.

ఒకరోజు ఎవరికో డబ్బు పంపించాలని మా ఐడిలు అడిగి తీసుకుంది. మా బుతాకా (ఐడి)లు వాడుకుని మనీ ఎక్స్చేంజ్ ల ద్వారా ఈజిప్టుకు డబ్బు పంపింది.

సేటు లండన్ నుండి రాగానే, ఆమె ఏమీ తెలియనట్లు ఇంట్లో కూర్చుంది. సేటుకు మామీద అనుమానం కలిగింది. ఆమె తన తప్పును మాపై నెట్టేసి, ఆ తప్పుడు రసీదులను సేటుకు చూపించి నమ్మించింది. సేటు మా మాట అసలు వినలేదు! మేము కూడా ఆమె గురించి చెప్పడానికి భయపడ్డాము" అన్నాడు నీళ్ళు తాగుతూ...

ఈ కథంతా విన్న అబ్దుల్లాకు కువైట్ చట్టాలు, బెదూన్ల ధర్మం గుర్తొచ్చాయి. రంజాన్ పవిత్ర మాసంలో అమాయకులకు అన్యాయం జరగడం ఆ అల్లాకే ఇష్టం ఉండదు, ఈ కథకు ముగింపు పలికి మస్రీలు నిరపరాధులని నిరూపించాలి అని భావించాడు.

మరుసటి రోజు రాత్రి సేటు తన ఇంట్లో ఏసీ గదిలో కూర్చుని హుక్కా పీలుస్తున్నాడు. పక్కనే డ్రైవర్ రాము నిలబడి ఉన్నాడు.

"రామూ... ఆ ముగ్గురి పీడ వదిలిపోయింది కదా? ఈపాటికి ఎడారిలో ఎముకలు కూడా మిగిలివుండవు" అన్నాడు సేటు క్రూరమైన నవ్వుతో.

"అవును సేటూ... ఇక వాళ్ళు తిరిగి రారు, వాళ్ళు చేసిన ద్రోహానికి అదే తగిన శిక్ష" అన్నాడు రాము నవ్వుతూ.

"ఈ విషయం ఎక్కడా బయట పడకూడదు. జాగ్రత్త..! బాగా శ్రమ పడ్డావు కాబట్టి ఇదిగో ఈ దినార్లు నువ్వు వుంచుకో" అని బహుమతిగా కొన్ని దినారాలు ఇచ్చాడు సేటు.

సరిగ్గా అదే సమయంలో సేటు మొబైల్ మోగింది. సేటు ఫోన్ ఎత్తగానే అవతలి వైపు నుండి ఒక గంభీరమైన గొంతు "సేటూ... నువ్వు చేసిన పాపం నిన్ను వదిలిపెట్టదు. నువ్వు చంపేయాలని చూసిన ఆ ముగ్గురు ఈజిప్షియన్లు నిరపరాధులు. అసలు దొంగ వేరే వున్నారు. నువ్వు చనిపోయారు అనుకున్న ముగ్గురు మస్రీలు ఇప్పుడు నా దగ్గర సురక్షితంగా ఉన్నారు.

రేపు ఉదయంకల్లా నువ్వు ఒంటరిగా 'అల్-జాఫ్రా' ఎడారి లోపలికి రాకపోతే, నువ్వు చేసిన ఈ హత్యాయత్నం విషయం, ఆ ముగ్గురి సాక్ష్యం కువైట్ 'పోలీస్ ముహాఫజా' (పోలీస్ హెడ్ క్వార్టర్స్) కు చేరుతుంది. కువైట్ జైల్లో నీ జీవితం ముగుస్తుంది" అంటూ.

ఫోన్ కట్ అయింది. సేటు ముఖం తెల్లగా పాలిపోయింది. చెమటలు పట్టేశాయి. పక్కనే ఉన్న సేటు మూడో భార్య అమీనా కూడా అది విని వణికిపోయింది.

"వాళ్ళు బతికే ఉన్నారా? మనం ఇప్పుడే పోలీసులకు చెప్దాం, వాళ్ళు దొంగతనం చేసి పారిపోయారని" అంది కంగారుగా.

కానీ సేటుకు తెలుసు, తానే చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వాళ్ళని ఎడారిలో వదిలేశాడు. ఈ విషయం తెలిస్తే కువైట్ చట్టం ప్రకారం తనకు శిక్ష పడుతుంది.

"వద్దు... మనం ఎడారికి వెళ్దాం. ఈసారి నాతో పాటు నా గన్ కూడా వస్తుంది. ఆ ముగ్గురినీ, వాళ్ళని దాచినవాడిని కలిపి అక్కడే కాల్చి పూడ్చేస్తాను" అని గర్జించాడు.

మరుసటి రోజు మధ్యాహ్నం అదే మండుటెండలో 'అల్-జాఫ్రా' ఎడారిలో సేటు జీపు వచ్చి ఆగింది.

జీపులో సేటు, డ్రైవర్ రాము ఉన్నారు. సేటు చేతిలో లోడ్ చేసిన గన్ ఉంది.

దూరంగా ఒక పెద్ద టెంట్ (డేరా) కనిపిస్తోంది. సేటు, డ్రైవరు తుపాకులు చేతబట్టి టెంట్ వైపు నడిచారు. టెంట్ లోపలికి వెళ్ళగానే అక్కడ ఆ ముగ్గురు ఈజిప్షియన్లు కుర్చీలలో కూర్చుని గహ్వా తాగుతున్నారు.

పక్కనే ముసలివాడైన అబ్దుల్లా, మనుమడు యువకుడైన తారిఖ్ కూడా కర్జూరాలను ప్లేట్లలో సర్దుతున్నారు. సేటు వారికి గన్ గురిపెట్టాడు. "మిమ్మల్ని కాపాడిన ఆ బెదూన్ ని చంపేస్తాను" అంటూ ఆవేశంగా అరిచాడు.

అకస్మాత్తుగా టెంట్ వెనుక నుండి చేతుల్లో రైఫిళ్లతో నలుగురు బెదూన్ యువకులు ప్రత్యక్షమయ్యారు. ఆ వ్యక్తులు ముందుకువచ్చి సేటు, రాము చేతుల్లోని తుపాకులను లాక్కున్నారు. సేటు షాక్ తిన్నాడు.

"ఎవరు మీరు? ఈ మస్రీలు నాకు ద్రోహం చేసారు. వీరిని ఎందుకు రక్షిస్తున్నారు" అని అరిచాడు.

వారు బిగ్గరగా నవ్వారు.వారు సాధారణ బెదూన్లు కాదు... ఆ వేషంలో వున్న కువైట్ సీక్రెట్ పోలీస్ అధికారులు.

అధికారుల వెనుక నుండి ఒక పోలీస్ కల్నల్ ముందుకు వచ్చాడు. అతని చేతిలో ఒక ఫైలు ఉంది.

"సేటు! నువ్వు లండన్ లో ఉన్నప్పుడు నీ భార్య దోచుకున్న కోటి దినారుల లావాదేవీల పూర్తి నివేదిక మాకు దొరికింది. అంతే కాదు, ఈ అమాయక ఈజిప్షియన్ల ఐడిలు వాడుకుని ఆమె చేసిన మనీ లాండరింగ్ ఆధారాలు కూడా మాకు దొరికాయి. నిజమేమిటో గ్రహించకుండా నువ్వు చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని వీరిని చంపాలని చూశావు. ఈ బెదూన్ అబ్దుల్లా మాకు సమాచారం ఇవ్వకపోతే, ఈ రోజు నీ వలన ముగ్గురు అమాయకులు ప్రాణాలు కోల్పోయేవారు" అన్నాడు కల్నల్ గంభీరంగా.

సేటు గుండె ఒక్కసారిగా పగిలినట్లయింది. తను ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించిన భార్య ఇలా చేసిందా..

బాధగా తల విదిలించాడు.

పోలీసులు సేటుకు, అతడికి సహకరించిన డ్రైవర్ రాముకు బేడీలు వేశారు.

బేడీలు పడ్డాక సేటు నడుచుకుంటూ వెళ్తూ, కట్టేసి ఉన్న ఆ ముగ్గురు ఈజిప్షియన్ల ముందు మోకాళ్లపై కూలబడ్డాడు. కన్నీళ్లతో "నన్ను క్షమించండి... డబ్బు మదంతో కళ్ళు మూసుకుపోయి నిజం తెలుసుకోకుండా మిమ్మల్ని ఎడారిలో పడేసాను. ప్రాణప్రదమయిన నా భార్యే నన్ను ముంచిందంటే నమ్మలేకపోతున్నాను. మిమ్మల్ని అనుమానించినందుకు నాకు సరైన శిక్ష పడింది" అని ఏడ్చాడు.

అహ్మద్, మిగతా ఇద్దరు ఈజిప్షియన్లు సేటు వైపు జాలితో చూశారు.

పోలీస్ జీపులు సైరన్ మోగిస్తూ ఎడారి దాటి సిటీ వైపు కదిలాయి. దీనంతటికీ కారణమయిన సేటు భార్య అమీనాను కూడా అరెస్టు చేసారు.

ఎడారి ఇసుక తిన్నెల్లో నిలబడి అబ్దుల్లా, తారిఖ్ ఆకాశం వైపు చూసి నమస్కరించారు.

రంజాన్ పవిత్ర మాసంలో అల్లా ఒక గొప్ప అన్యాయాన్ని అడ్డుకున్నాడని ముగ్గురి ప్రాణాలు కాపాడేలా చేసాడని వారి మనసుకు అనిపించింది. భగవంతుడి న్యాయం ఎప్పుడూ ఆలస్యం కావచ్చు, కానీ తప్పక జరుగుతుందని ఆ ఎడారి గాలి నినదించింది.

(మరోకథ వచ్చేనెల)

Post your comments